
నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
11 | హైదరాబాద్, శనివారం 9 మార్చి 2024 | SANGAREDDY



సిద్దిపేటలో మండల మహిళా సమాఖ్యకు చెక్కు అందజేస్తున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మహిళాభివృద్ధికి శక్తిమేర కృషి
- సిద్దిపేట ప్రజలే బలం బలగం
- నాపై మీ ప్రేమాభిమానాలు ఎల్లప్పుడూ ఉండాలి
- సిద్దిపేట అభివృద్ధికి కృషిచేశా..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- చిన్నకోడూరు, సిద్దిపేటలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ



సిద్దిపేటలో ఉచిత కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట/ చిన్నకోడూరు, మార్చి 8: మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే తన అభిమతమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. చిన్నకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో చిన్నకోడూరు, పెద్దకోడూరు, చంద్లాపూర్, చెల్కలపల్లి, అల్లీపూర్, మాచాపూర్, ఎల్లాయిపల్లి తదితర గ్రామాలకు చెందిన 500 మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మీప్రేమ.. మీ ఆశీర్వాదం తనకు కొండంత బలం అన్నారు. చిన్నకోడూరు మండలంలో 500 మందికి కుట్టు శిక్షణ, ఉచితంగా కుట్టుమిషన్లను అందజేశామన్నారు. మహిళలు సొంత కాళ్ల మీద నిలబడాలనే ఆకాంక్షతో ఉడతా భక్తిగా ఈ సహాయం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం మండల సమాఖ్యకు యాసంగి సీజన్ మార్కెట్ సేవారుసుం కింద 14.43 లక్షల చెక్కు అందజేశారు. వాటర్‌షెడ్ కార్యక్రమంలో మంజూరైన రూ.1.55 కోట్ల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి, సొసైటీ చైర్మన్లు కనకరాజు, సదానందం గౌడ్, వైస్ ఎంపీపీ పాపయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కామున శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మూర్తి బాల్‌రెడ్డి, రామచంద్రం, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు వేణు, నాయకులు ఉమేశ్‌చంద్ర, రవీందర్‌రెడ్డి, ఏపీఎం మహిపాల్, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**మహిళలకు అవకాశాలు కల్పిస్తేనే..**

మహిళలకు అన్ని అవకాశాలు కల్పిస్తేనే నిజమైన సమాజాభివృద్ధి సాధ్యమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం నంగునూరు మండలం, సిద్దిపేట రూరల్, అర్బన్ మండలం, చిన్నకోడూరు మండలం, నారాయణరావుపేట మండలాలకు చెందిన మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ.. ఆరు నెలల క్రితం రెండు బ్యాచ్‌లుగా ఆయా గ్రామాల్లో మహిళలకు ఉచిత కుట్టుశిక్షణ ఇప్పించానన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు కుట్టుమిషన్లు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 2200 మందికి ఉచితంగా కుట్టుశిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఉచిత కుట్టుశిక్షణ ఇవ్వడంతో 10వేల రూపాయల విలువ కుట్టుమిషన్ ఉచితంగా ఇసున్నట్లు తెలిపారు. మహిళాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలు అమలు చేసినట్లు గుర్తుచేశారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా, రాజకీయాలతో సంబంధం లేకుండా మీ కుటుంబ సభ్యుడిగా మీకోసం పనిచేస్తున్నని, కంపెనీల వద్ద ఉద్దెర పెట్టి మీకోసం కుట్టుమిషన్లు తెచ్చి పంపిణీ చేస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. తనపై మీ ప్రేమ ఆశీర్వాదం ఎప్పటికీ ఇలాగే ఉండాలన్నారు. ఎస్టీ, బీసీ విద్యార్థినుల కోసం డిగ్రీ గురుకుల కాలేజీలను ప్రారంభించానని తెలిపారు. సిద్దిపేటలో మహిళల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేసినట్లు తెలిపారు. తన శక్తిమేర సిద్దిపేట అభివృద్ధికి అన్నివిధాలా కృషిచేసినట్లు తెలిపారు.



కార్యక్రమానికి హాజరైన మహిళలు



మహాశివరాత్రి సందర్భంగా అమ్మవారి ప్రత్యేక అలంకరణ

# అమ్మా శాంభవి

## ఏడుపాయల జాతర షురూ.. మార్మోగిన దుర్గమ్మ నామస్మరణ

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- మూడు రోజుల పాటు వేడుకలు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన మెదక్ ఎమ్మెల్యే రోహిత్ దంపతులు
- దర్శించుకున్న దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్
- హాజరైన కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతులు



అమ్మవారికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు దంపతులు

పాపన్నపేట, మార్చి 8: తెలంగాణలోనే జానపదుల జాతరగా పేరుగాంచిన ఏడుపాయల వనదుర్గా భవానీమాత జాతర శుక్రవారం ప్రారంభమైంది. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు దంపతులు ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు తెలంగాణ,మహారాష్ట్ర,కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి సుమారు 12 లక్షల మంది వరకు భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా చేశారు. అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశారు. జాతరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 కోట్ల నిధులు విడుదల చేయడంతో వసతులు కల్పించారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్,కలెక్టర్ రాహుల్‌రాజ్ దంపతు అమ్మవారిని దర్శించుకున్నారు.వీరికి ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి స్వాగతం పలికారు.

**ఆకట్టుకున్న అమ్మవారి అలంకరణ**

మహాశివరాత్రిని పురస్కరించుకుని ఏడుపాయల వనదుర్గా భవానీమాతను ప్రత్యేకంగా అలంకరించారు. ఎప్పుడూ వెండి కిరీటంతో దర్శనమిచ్చే అమ్మవారిని, జాతర సందర్భంగా బంగారు కిరీటం, బంగారు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ గర్భగుడితో పాటు ఆలయం లోపల బయట వివిధ రకాల రంగుల పూలతో అలంకరించి విద్యుత్ దీపాలతో మిరుమిట్లు గొలిపేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు.

**శివుడి ప్రతిమ ఏర్పాటు**

ఏడుపాయల వనదుర్గా భవానీమాత ఆలయం ఎదుట మంజీరా పాయల్లో ఏర్పాటు చేసిన శివుడి విగ్రహం భక్తులను ఆకట్టుకుంది. కోయంబత్తూరులోని ఈషా పౌండేషన్ మాదిరిగా ఏర్పాటు చేశారు. భక్తులు వేకువజామునే మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివుడి విగ్రహానికి పూజలు నిర్వహించి ఉపవాస దీక్షలు చేపట్టారు.

**దారులన్నీ ఏడుపాయల వైపే..**

వివిధ ప్రాంతాల నుంచి భారీగా భక్తులు ఏడుపాయలకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. బీదర్, జహీరాబాద్, నారాయణఖేడ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు నాగ్‌సాన్‌పల్లి మీదుగా ఏడుపాయల చేరుకున్నారు. హైదరాబాద్ బాలానగర్, నర్సాపూర్, సంగారెడ్డి తదితర ప్రాంతాల భక్తులు పోతన్‌శెట్టిపల్లి మీదుగా ఏడుపాయలకు చేరుకున్నారు.

**పటిష్ట బందోబస్తు**

మెదక్ జిల్లా ఎస్పీ బాలస్వామి పర్యవేక్షణలో మెదక్ డీఎస్పీ రాజేశ్ ఆధ్వర్యంలో ఏడుపాయల్లో గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. 1000 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటుతో పాటు మఫ్టీలో పోలీసులను నియమించి బందోబస్తు చర్యలు చేపట్టారు.



నది పాయల్లో స్నానమాచరిస్తున్న భక్తులు

**ఏడుపాయల అభివృద్ధికి కృషిచేస్తాం: మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు**

ఏడుపాయల అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. దుర్గామాత దర్శనం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఏడుపాయల్లో శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడతామన్నారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు



ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ, డెకరేషన్

# ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ మంత్రి,ఎమ్మెల్యే హరీశ్‌రావు
- కోటిలింగాల ఆలయంలో ప్రత్యేక పూజలు



పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, మార్చి 8: శివుడి దీవెనలతో అందరూ సంతోషంగా ఉండాలని, రైతులు పాడిపంటలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. శుక్రవారం సిద్దిపేట కోటిలింగాల ఆలయంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శివుడికి ఆయన అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆ పరమశివుడి దయతో, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భగీరథ ప్రయత్నంతో జిల్లాలో ప్రాజెక్టులు నిర్మించుకున్నామని తెలిపారు. కాళేశ్వరం నీళ్లతో ఈ ప్రాంతంలో బంగారు పంటలు పండాలని, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ప్రార్థించానన్నారు. అనంతరం నారాయణరావుపేట మండలం బుగ్గరాజేశ్వరాలయాన్ని దర్శించుకుని హరీశ్‌రావు అభిషేకాలు చేశారు.



అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

# భక్తజనంతో కిక్కిరిసిన కేతకీ



ఎమ్మెల్యే మాణిక్‌రావుకు శఠగోపంతో ఆశీర్వదిస్తున్న అర్చకులు



దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు



స్వామివారి మూలవిరాట్

ఝరాసంగం, మార్చి 8: తెలంగాణ రాష్ట్రంలో శైవ క్షేత్రాల్లో ఒకటిగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం కేతకీ సంగమేశ్వరాలయంలో నవాహ్నిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే దేవాలయానికి భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్రకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. భక్తులు అమృత గుండంలో స్నానాలు ఆచరించి గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శివదీక్షా పరులు 41 రోజుల పాటు భక్తి శ్రద్ధలతో చేపట్టిన శివదీక్ష విరమించి మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నిర్వహించారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, సివిల్ కోర్టు జూనియర్ జడ్జి అనూష, సంగారెడ్డి అదనపు ఎస్పీ సంజీవరావు, ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ దర్శించుకుని రుద్రాభిషేకం చేశారు.స్వామి వారి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో మాజీ మంత్రి చంద్రశేఖర్, మాజీ చైర్మన్లు మఠం భిక్షపతి, నరోత్తం, ఉమాకాంత్ పాటిల్, ఎంపీటీసీ రజిని ప్రియ సంతోష్ పాటిల్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ ఉజ్వల్ రెడ్డి, గిరిధర్ రెడ్డి, హన్మంత్ రావు పాటిల్, నరేశ్‌గౌడ్ పాల్గొన్నారు.



# జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్



సంగారెడ్డి మార్చి 8 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎంపీ అభ్యర్థులను ప్రకటిస్తున్నాయి. ఇటీవల బీజేపీ జహీరాబాద్ ఎంపీ అభ్యర్థిగా బీబీపాటిల్ పేరును ప్రకటించింది. తాజాగా కాంగ్రెస్ పార్టీ శుక్రవారం తొలిజాబితాను ప్రకటించింది. అందులో తెలంగాణకు చెందిన నలుగురు అభ్యర్థులను ప్రకటించింది. అందరూ ఊహించినట్లుగానే జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్ షెట్కార్ పేరును అధిష్టానం ప్రకటించింది. నారాయణఖేడ్‌కు చెందిన సురేశ్‌షెట్కార్‌కు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే టికెట్ కేటాయించింది. అయితే నారాయణఖేడ్ ఎమ్మెల్యే టికెట్ కోసం పోటీపడిన కాంగ్రెస్ నాయకుడు పట్లోళ్ల సంజీవరెడ్డి తనకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని పట్టుబట్టాడు. ప్రస్తుత మంత్రి దామోదర రాజనర్సింహ ద్వారా కాంగ్రెస్ అధిష్టానంపై ఒత్తిడి తీసుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్టానం సురేశ్‌షెట్కార్ ఎంపీ టికెట్ ఇస్తామని నచ్చజెప్పి పోటీ నుంచి తప్పుకునేలా చేసింది. సురేశ్ షెట్కార్ తనకు వచ్చిన కాంగ్రెస్ బీఫామ్‌ను సంజీవరెడ్డికి అప్పగించారు. ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ అధిష్టానం సురేశ్ షెట్కార్‌కు ఎంపీ టికెట్ ఇచ్చింది. కాంగ్రెస్ తొలిజాబితాలోనే అయన పేరును ప్రకటించటం గమనార్హం. జహీరాబాద్‌కు చెందిన ఉజ్వల్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపీ టికెట్ కోసం పోటీ పడినా అధిష్టానం ఆయనకు టికెట్ ఇవ్వకుండా సురేశ్ షెట్కార్‌ను ప్రకటించింది. దీంతో ఉజ్వల్‌రెడ్డి మద్దతుదారుల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. కామారెడ్డి జిల్లాకు చెందిన పలువురు నాయకులు ఎంపీ టికెట్ ఆశించారు. వారికి ఎంపీ టికెట్ దక్కకపోవడంతో నిరాశకు గురయ్యారు.

# కొమురెల్లి మల్లన్న.. కోటి దండాలు

- భక్తజన సంద్రంగా మారిన క్షేత్రం
- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు
- పెద్దపట్నం వీక్షించేందుకు తరలివచ్చిన భక్తులు
- దర్శించుకున్న ఎమ్మెల్యే పల్లా, డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి, పలువురు ప్రముఖులు



కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, మార్చి 8: మహా శివరాత్రిని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రం భక్తజన సంద్రంగా మారింది. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో అతి ముఖ్యమైన ఘట్టాల్లో ఒక్కటైన పెద్దపట్నం వీక్షించేందుకు, మహా శివరాత్రి జాగరణ చేసేందుకు వరంగల్, మెదక్, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి తదితర పాత జిల్లాల నుంచి భారీగా భక్తులు వచ్చారు. శుక్రవారం సాయంత్రం నుంచే భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బిగ్‌బాస్ విన్నర్ పల్లవీప్రశాంత్ వారి కుటుంబసభ్యులతో కలిసి మల్లన్నను దర్శించుకున్నారు. వీరికి ఆలయ వర్గాలు ఘన స్వాగతం పలికాయి. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వేకువ జాము 4గంటల వరకు 155 మంది ఒగ్గు పూజారులు భక్తిశ్రద్ధలతో పెద్దపట్నం నిర్వహించారు. ఈవో బాలాజీ, ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, కమిటీ సభ్యులు, ఏఈవోలు గంగా శ్రీనివాస్, బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకుడు నీలశేఖర్, సిబ్బంది, అర్చకులు, ఒగ్గు పూజారులు విధులు నిర్వర్తించారు. అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్ ఆధ్వర్యంలో చేర్యాల సీఐ శ్రీను, చేర్యాల, కొమురవెల్లి ఎస్సైలు దామోదర్, నాగరాజు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.



గంగరేగు చెట్టు ఆవరణలో భక్తుల రద్దీ

# మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి పునరుజ్జీవం

- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తాం
- ఇప్పటి వరకు 26కోట్ల మంది మహిళ లు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు
- హుస్నాబాద్ డిపో, బస్టాండ్లను అభివృద్ధి చేస్తాం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్
- రూ.2కోట్లతో హుస్నాబాద్ బస్టాండ్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన




సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, మార్చి 8: మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి పునరుజ్జీవం వచ్చిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రూ.2కోట్ల నిధులతో బస్టాండ్ ఆధునీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ఉచిత ప్రయాణంతో బస్సులు, బస్టాండ్లు కళకళలాడుతున్నాయని, ఇప్పటి వరకు 26కోట్ల మంది మహిళలు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం కోసం ప్రభుత్వం నెలకు రూ.350కోట్లు ఆర్టీసీకి చెల్లిస్తున్నదని చెప్పారు. గతంలో కేవలం 50 నుంచి 60 శాతం ఆక్యుపెన్సీ మాత్రమే ఉండేదని, ప్రస్తుతం 100 శాతం ఆక్యుపెన్సీ వస్తున్నదన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచడంతో పాటు కొత్త బస్టాండ్ల నిర్మాణం చేపడుతామన్నారు. ఆర్టీసీలోని 50వేల మంది ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, వీరి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని చెప్పారు. ఎన్నికల కోడ్ వచ్చేలోగా చీఫ్ సెక్రటరీ, ఆర్టీసీ ఎండీతో చర్చించి పాత బకాయిలను చెల్లించేందుకు జీవో తెస్తామని హామీ ఇచ్చారు. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. హుస్నాబాద్ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచి మంత్రినయ్యానని, ఈ ప్రాంత అభివృద్ధితో పాటు డిపోకు ఆదాయం పెంచేందుకు కొత్త రూట్లను త్వరలోనే కేటాయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ వినోద్‌కుమార్, ఆర్ఎం సుచరిత, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, సీఈ భూపతిరెడ్డి, డీఎం వెంకటేశ్వర్లు, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు, ఆర్టీసీ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.